క్లుప్తంగా

గర్భిణులకు అవగాహన



పురుషోత్తపురంలో సదస్సును పర్యవేక్షిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం పురుషోత్తపురంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-8 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్ఎస్ మూర్తి, ఏపీడీ శ్రీరామ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన రిజిస్ట్రార్‌కు అభినందన



రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌ను అభినందిస్తున్న దేముడు

పెందుర్తి: ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం.జేమ్స్ స్టిఫెన్‌కు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అభినందనలు తెలిపారు. గురువారం ఏయూలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అప్పన్న సన్నిధిలో సినీ దర్శకుడు గోపీచంద్



అప్పన్న ఆలయంలో గోపిచంద్ మలినేని

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. సినీ హీరో రవితేజతో తీసే సినిమా షూటింగ్ ఈనెల 15నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో బోటు బోల్తా



దెబ్బతిన్న బోటు వద్ద మత్స్యకారులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోటు దెబ్బతినడంతో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని మత్స్యకార నాయకుడు సూరాడ ముత్యాలరావు చెప్పారు. గ్రామానికి చెందిన వాసుపల్లి తాతారావు, మారయ్య, వాసుపల్లి నల్లయ్య, అరిజిల్లి కుమార్, పరదేశి గురువారం తెల్లవారుజామున బోటుపై చేపల వేటకు వెళ్లారు. చేపల వేట ముగించుకుని తిరుగు వస్తున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు అలలు ఎగసిపడడంతో బోటు బోల్తా పడింది. సమీపంలోని రాళ్లను ఢీ కొట్టడడంతో విరిగిపోయింది. వల సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో మత్స్య కార్మికులు స్వల్పంగా గాయపడి.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఒడ్డుకు చేరారు. దెబ్బతిన్న బోటుపై 10 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

ఎఫ్‌డీపీ తరగతులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై మూడు రోజుల పాటు ఈ తరగతులు జరగనున్నాయి. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన 170 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటా వెలుగు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సభకు హాజరైన ప్రజలు, నాయకులు



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రతీ ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెద ముషిడివాడ గ్రామంలో రెండో రోజు గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గ్రామ మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలవలపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అమ్మ ఒడి, విద్యా కానుక, డ్వాక్రా రుణ మాఫీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేసి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ,జనసేన నాయకులు కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తూ మీ అందరికీ తోడుగా నిలుస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, వైస్ సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, సీనియర్ నాయకులు సందవరపు శ్రీనివాసరావు, యలమర్తి బుజ్జి, ఒమ్మి అర్జునరావు, సచివాలయ కన్వీనర్ అలమండ నారాయణరావు, బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మధురవాడ ఐటీ హిల్ - 3 హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సీఎం ఆత్మీయంగా పలకరించారు.

- విశాఖపట్నం

నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహం



ఉపకార వేతనాలు అందజేస్తున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ: సామాజిక బాధ్యతలో భాగంగా నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి అందిస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్ కృష్ణ కోరారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో రాంకీ ఫౌండేషన్ సమకూర్చిన ఉపకార వేతనాల చెక్కులను గురువారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు చాలా ముఖ్యమైందన్నారు. మనిషిని ఉన్నత స్థానంలో నిలబెట్టగలిగేది చదువు ఒక్కటేనని చెప్పారు. 50 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకోవడానికి ఉపయోగపడే విధంగా రూ.10 లక్షల ఉపకార వేతనాలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ ఏజీఎం పి.వి.రాఘవరెడ్డి, సీడబ్ల్యూఎంపీ హెడ్ కె.రవికుమార్, లైజనింగ్ ఆఫీసర్ పి.అ ప్పయ్య, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



అయ్యప్ప భక్తులతో మాలధారణ చేయిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మండల దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి చేతుల మీదుగా భక్తులకు మాలధారణ చేశారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయ అధికారి రూపావతి తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి కె. వర భాస్కరనాయుడు మహారాష్ట్రలో జరగబోయే సీనియర్ లెవెల్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్ల కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ గురువారం తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 14నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు చెప్పారు.తమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న వరభాస్కరనాయుడు గత నెల 8,9వ తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ఈ మేరకు ఆ విద్యార్థిని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి ఎస్. రూపావతి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమార్, పీఈటీ సూర్యనారాయణ, పీడీ సీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

డీసీసీబీల సేవలు అద్భుతం

లక్నో బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్



సబ్బవరం పరపతి సంఘం ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తున్న సీఈవో రమణ

సబ్బవరం: నాబార్డ్ సహకారంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అద్భుతమైన సేవలు అందిస్తున్నాయని లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్ కితాబునిచ్చారు.సబ్బవరం మండల కేంద్రంలోని శ్రీ దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని గురువారం లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా సొసైటీ సీఈవో గొంప రమణ లక్నో బృందానికి 32 గ్రామాల్లో విస్తరించి ఉన్న దుర్గమాంబ సొసైటీ రైతులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు గోల్డ్ లోన్ కూడా రైతులకు అందజేస్తున్నామని వివరించారు. రైతులకు అమలు చేస్తున్న వడ్డీ రేటు గురించి కూడా లక్నో బృందం అడిగి తెలుసుకుంది. తమ బృందంలో మిజోరాం ,ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ ,హరియాణ రాష్ట్రాల సహకార బ్యాంకు చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు కలిపి సుమారు 40 మంది సభ్యుల బృందం జిల్లాలో పర్యటిస్తుందని తెలిపారు. పర్యటనలో భాగంగా మునగపాక మండలం నాగులపల్లి వద్దగల తోటాడ గ్రామంలోరూ. 35 లక్షలతో నిర్మిస్తున్న గోదామును పరిశీలించామని తెలిపారు. ఈ పర్యటనలో అనకాపల్లి బెల్లం విశిష్టతను తెలుసుకున్నామని ఆయన వివరించారు. సబ్బవరం దుర్గమాంబ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలను ఆ బృందం ప్రశంసించింది. కేంద్ర సహకార బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పెంటకోట స్వామి నాయుడు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీవీఎస్ రామారావు, సబ్బవరం సొసైటీ పాలకవర్గ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో చెంతకే వైద్యం



మందులు అందిస్తున్న ముమ్మన దేముడు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెందుర్తి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుందని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 504 సచివాలయం పరిధిలోని గొల్లవిల్లి వానిపాలెం, రత్నగిరినగర్, సాయిసాధానగర్, సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు ప్రాంతాల ప్రజలకు గురువారం పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 270 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ , నాయకులు ఊట పెంటారావు, మంగమ్మ, కనక మహాలక్ష్మి, అంగటి సూరిబాబు, పారాపు సంతోష్, కంచిబోయిన సంతోష్, అనిత, జీవీఎంసీ సీవో కనకరత్నం పాల్గొన్నారు.

406 మందికి వైద్య సేవలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో గురువారం 523 సచివాలయం పరిధిలో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 406 మందికి వైద్యులు సేవలు అందించారు. అలాగే బీపీ, సుగర్ టెస్టులు నిర్వహించారు. చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలందించారు. పలువురికి కళ్ల పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. సచివాలయ కన్వీనర్లు కె.పైడిరాజు, ఎన్. రామరాజు, సి.హెచ్. కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, సచివాలయ కార్యదర్శులు భవాని, భారతి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రియాగార్డెన్‌లో 510 మందికి

అడవివరంలోని ప్రియాగార్డెన్స్‌లో 528 సచివాలయం పరిధిలో వారి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 510 మందికి స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందించారు. మందులు ఉచితంగా అందజేశారు. సచివాలయ కన్వీనర్లు దొంతల సంతోష్, ఎస్.కృష్ణ, టి.రాము, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, నాయకులు లంక సత్తిబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీన్ ఆచార్య విజయ్‌మోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసనాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. వర్సిటీలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద కూడా ర్యాగింగ్ నిషేధంపై ప్రత్యేక బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ హౌస్‌లో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం గెస్ట్ హౌస్ డీన్ ఆచార్య టి.షారోన్‌రాజు సిబ్బందితో కలిసి వ్యర్థాలను తొలగించారు. చెట్లకు పెయింటింగ్ వేశారు.

విద్యార్థి ఆత్మహత్య



కిశోర్ (ఫైల్)

పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు గౌతులచ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్న గేదెల కిశోర్(18) అనే విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ అందించిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కోరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గేదెల వెంకటరావు భార్య, ఇద్దరు సంతానంతో ఉద్యోగ రీత్యా గౌతులచ్చన్ననగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. వెంకటరావు ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు కిశోర్ షీలానగర్‌లోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కిశోర్ గురువారం ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం 5 గంటలకు అతడి చెల్లి అపరంజిని ఇంటి తలుపు తీయగా లోపల ఫ్యాన్‌కు ఉరివేసుకొని అన్నయ్య కనిపించడంతో తల్లికి చెప్పింది. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఫ్యానుకు వేలాడుతున్న కిశోర్‌ను కిందకు దించారు. కిశోర్ మృతి చెందడానికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడవుతాయని ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

సమన్వయంతో పని చేస్తే ప్రగతి

- ఎంపీపీ బోకం సూర్యకుమారి
- పలు అంశాలపై సమగ్ర చర్చ



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ అప్పారావు

సబ్బవరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు సేవలు ప్రజలకు సత్వరంగా అందుతాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల తమ గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తనకు సమాచారం ఇవ్వలేదని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, గొల్లలపాలెం సర్పంచ్ మో పాడ అప్పారావు అధికారులను నిలదీశారు.దీంతో ఎంపీడీవో రమేష్ నాయుడు, సబ్బ వరం పీహెచ్‌సీ ప్రధా న వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి సమాచారం ఇచ్చామని చెప్పినప్పటికీ సభలో కొద్దిపాటి వివాదానికి దారితీసింది. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకుని సమయమనం పాటించాలని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రిజిస్ట్రేషన్ సేవలపై అసంతృప్తి

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు సజావుగా జరగడం లేదని ఆరిపాక సచివాలయ కన్వీనర్ శరగడం రాము విమర్శించారు. గత నెల 20వ తేదీన డాక్యుమెంట్ నకలుకు దరఖాస్తు చేసుకుంటే ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. సవరణకు తహసీల్దార్ ధ్రువీకరణ పత్రం,సర్వే రిపోర్టు ఇచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇబ్బంది ఏంటని రిజిస్ట్రార్ రత్నకుమార్‌ను నిలదీశారు. అలాగే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి గ్రామ పంచాయతీలు, మండలానికిస్టాంప్ డ్యూటీ రావడం లేదని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో జమఅవుతాయని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

హౌసింగ్ స్థలాలకు ప్రతిపాదనలు

తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ సబ్బవరం,ఆరిపాక,లగిశెట్టిపాలెం తదితర 6 గ్రామాల్లో జగనన్న గృహ నిర్మాణాలకు అర్హులు ఉన్నారన్నారు. ఆయా ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడే వారు ఎప్పటికీ హక్కుదారులు కాలేరని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ, గృహ నిర్మాణం,నీటిపారుదల,విద్యుత్,రోడ్లు భవనాల శాఖ ప్రగతి,పనితీరుపై చర్చించారు.

సంతాపం

సమావేశం ప్రారంభానికి ముందు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీలక్ష్మీరాణి, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏవో బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో వరి పంటకు తెగుళ్ల బెడద

అనకాపల్లి ఏడీఏ రామారావు



నారపాడులో వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సబ్బవరం: వర్షాభావ పరిస్థితి వల్ల వరి పంటకు తెగుళ్ల బెడద పెరిగిందని అనకాపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం. రామారావు అన్నారు. మండలంలోని నారపాడు, నల్లరేగులపాలెం గ్రామాల్లో వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల ప్రభావం పంటలపై ఉంటుందన్నారు. వరి నాట్లు వేసిన తర్వాత ఆగస్టు నెల నుంచి నేటి వరకు 362.2 ఎంఎం లోటు వర్షపాతం నమోదు కావడంతో వరి పంట కొన్ని చోట్ల ఎండిపోతున్న పరిస్థితి ఉందన్నారు.వరి పంటలో ఆకు ముడత చాలా ఉధృతంగా వ్యాపించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. బాలరాజు, నారపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు బుద్ధ హరీష్ అప్పారావు, రైతులు పాల్గొన్నారు.